ఏళ్లు గడుస్తున్నాయి అంతే..

- గన్నేరువరం మండలంగా ఏర్పడి ఎనిమిదేళ్లు
- అద్దె భవనంలో తహసీల్దార్ కార్యాలయం
- ఎంపీడీవో, పోలీస్‌స్టేషన్‌లకు సొంత భవనాలు కరువు
- కాంగ్రెస్ ప్రభుత్వంపైనే ఆశలు

గన్నేరువరం: బీఆర్‌ఎస్ ప్రభుత్వం కొత్త మండలాలను ఏర్పాటు చేసి పాలనను ప్రజలకు అందుబాటులో తీసుకువచ్చింది. ప్రజలు సైతం గత ప్రభుత్వ నిర్ణయాలను స్వాగతించారు. కానీ క్షేత్రస్థాయిలో అద్దె భవనాలు.. అరకొరత వసతులు.. సిబ్బంది కొరత... గాడిన పడని పాలనతో ఎనిమిదేళ్లు ముగిశాయి. మానకొండూర్ నియోజకవర్గంలో కొత్త మండలాన్ని ఏర్పాటు చేసిన ఘనత బీఆర్‌ఎస్ ప్రభుత్వం, మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్‌కు దక్కింది కాని భవనాల నిర్మాణాల్లో నిర్లక్ష్యం చేశారనే విమర్శలు వెలువడుతున్నాయి. ఇప్పుడున్న కాంగ్రెస్ ప్రభుత్వంపైనే ప్రజలు ఆశలు పెట్టుకున్నారు. ఇటీవల ప్రాథమిక ఆరోగ్యకేంద్ర భవన నిర్మాణానికి ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ శంకుస్థాపన చేయడంతో ఆశలు చిగురిస్తున్నాయి. తహసీల్దార్, ఎంపీడీవో, ఎస్సై, ఏవో, ఏపీఎం మినహ ఏ అధికారి ఎక్కడ ఉంటారో తెలియని పరిస్థితి. భవన నిర్మాణాలకు మండలకేంద్రం కేంద్రంలో స్థలాలను గుర్తించి ఐదేళ్లు గడుస్తున్నా నిర్మాణం ఊసేలేదు. తహసీల్దార్, ఐకేపీ, వ్యవసాయశాఖ కార్యాలయాలను, పోలీస్‌స్టేషన్‌ను అద్దె భవనాల్లో ఏర్పాటు చేశారు. మండల పరిషత్ కార్యాలయం అద్దె భారం కారణంగా ఎస్సీ హాస్టల్‌లోకి రెండేళ్ల క్రితం మార్చారు. మండల సర్వసభ్య సమావేశాలు టెంట్ కింద నిర్వహించుకోవాల్సి దుస్థితి. మండల విభజన జరిగిన మండల పరిషత్‌కు సంబంధించిన పాలన 2016 నుంచి 2019 జూలై వరకు ఉమ్మడి బెజ్జంకి మండలం నుంచే కొనసాగింది. 2019 నుంచి మండల పరిషత్ ఎన్నికల అనంతరం మండల పరిషత్ కార్యాయాలన్ని అధికారులు అద్దె భవనంలో ఏర్పాటు చేయగా ఇందులో రెండున్నరేళ్ల వరకు కొనసాగించారు. అరకొర వసతులతో వ్యవసాయశాఖ కార్యాలయం మూడు అద్దె భవనాల్లో కొనసాగింది. చివరకు రైతు వేదికల నిర్మాణాలు పూర్తి చేయడంతో ఏఈవోలు అక్కడి నుంచి పనులు చేస్తున్నారు. ప్రస్తుతం సొంత భవనం లేక రైతువేదికలోనే కార్యాలయం ఏర్పాటు చేసుకున్నారు. ఆరోగ్యకేంద్రం, పశువైద్యశాలకు భవనాలు లేకపోవడంతో పాటు తిమ్మాపూర్ మండల అధికారులకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. ప్రజలు ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారు. ఆయుర్వేద భవనంలో పోలీస్‌స్టేషన్ కొనసాగుతుంది. ఒకే ఒక్క భవనం ఉండటంతో సిబ్బందికి ఇక్కట్లు తప్పడం లేదు. సరియైన వసతులు లేక ఉద్యోగులు, సిబ్బంది ఇక్కడ విధులు నిర్వహించడానికి వెనుకంజ వేస్తున్నారు. బదిలీపై వస్తున్న అధికారులు, సిబ్బంది ఏడాది ముగియక ముందే మళ్లీ బదిలీపై వెళ్లిపోతున్నాయి. ఆయుర్వేద ఆసుపత్రికి వైద్యుడు లేడు. ఇటీవల చాకలివానిపల్లె శివారులో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణానికి ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ శంకుస్థాపన చేయడంతో మిగతా కార్యాలయాల నిర్మాణాలపై ఆశలు చిగురుస్తున్నాయి. ప్రభుత్వం మిగతా వాటిపై ప్రత్యేక దృష్టి సారించి నిర్మాణాలను చేపట్టడంపై ప్రత్యేక చొరవ తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.


చాకలివానిపల్లె శివారులో పీహెచ్‌సీ భవనానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి(ఫైల్)


ఎస్సీ హాస్టల్‌లో మండల పరిషత్ కార్యాలయం

క్లుప్తంగా

సివిల్ జడ్జికి సన్మానం


బత్తుల మానసను సన్మానిస్తున్న నాయకులు

హుజూరాబాద్: పట్టణానికి చెందిన బత్తుల మానస జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపిక కావడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులు మంగళవారం ఘనంగా సన్మానించారు. ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకుడు రుద్రారపు రామచంద్రం మాట్లాడుతూ.. బత్తుల మానస అనేక ఆటంకాలను ఎదుర్కొని కష్టపడి చదివి జూనియర్ సివిల్ జడ్జిగా ఎన్నికయ్యిందని నేటి తరం ఆడపిల్లలకు ఆదర్శమన్నారు. ఆడపిల్లలు ఉన్నత ఉద్యోగాలు సాధించి జీవితంలో స్థిరపడాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు శ్రీనివాస్, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ తడికమళ్ల శేఖర్, నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు చల్లూరి రాహుల్, రిటైర్డ్ టీచర్ బొడ్డు ఐలయ్య, మొ లుగు శ్రీధర్, మేకల జానీ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ ఈటల రాజేందర్ దిష్టిబొమ్మ దహనం

హుజూరాబాద్: పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో మంగళవారం మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ దిష్టిబొమ్మను యూత్ కాంగ్రెస్ నాయకులు దహనం చేశారు. యూత్ కాంగ్రెస్ మండలాధ్యక్షుడు పంజాల అరవింద్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి కట్టుబడి పనిచేస్తుంటే.. రాజకీయ ఉనికి కోసం ఈటల రాజేందర్ తప్పుడు వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. కేంద్రం నుంచి రాష్ట్రానికి నిధులు తీసుకురావడంలో బీజేపీ ఎంపీలు విఫలమయ్యారని, సీఎం, ప్రభుత్వంపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే ఊరుకోబోమని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు మేకల రాజ్ కుమార్, చల్లూరి విష్ణువర్ధన్, సంపంగి అరుణ్, పంజాల రాజు, గొస్కుల మధుకర్ బన్నీ, సంపత్, ఏనుగుల బన్నీ, కృష్ణంరాజు, సాయి తదితరులున్నారు.

తహసీల్దార్‌ను కలిసిన సీపీఐ నాయకులు


తహసీల్దార్‌ను సన్మానిస్తున్న నాయకులు

గన్నేరువరం: సీపీఐ నాయకుడు కాంతాల అంజిరెడ్డి, మండల కార్యదర్శి చొక్కాల శ్రీశైలం ఆధ్వర్యంలో నాయకులు మంగళవారం గన్నేరువరం తహసీల్దార్ నరేందర్‌ను కలిశారు. పార్టీ మండల నూతన కమిటీ నియామకం కావడంతో తహసీల్దార్‌ను కలిసి శాలువాతో సన్మానించామన్నారు. కార్యక్రమంలో మండల సహాయ కార్యదర్శులు కూన మల్లయ్య, పిప్పల కనుకయ్య, గ్రామ కార్యదర్శి బోయిని మల్లయ్య, నాయకులు బొమ్మకంటి ఆంజనేయులు పాల్గొన్నారు.

అక్రమ కేసులను ఉపసంహరించుకోవాలి

హుజూరాబాద్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సాక్షి దినపత్రిక ఎడిటర్ ధనంజయరెడ్డిపై కక్షపూరితంగా పెట్టిన అక్రమ కేసులను ఉపసంహరించుకోవాలని, కాంగ్రెస్ పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ సోషల్ మీడియా ఇన్‌చార్జి మిడిదొడ్డి రాజు మంగళవారం డిమాండ్ చేశారు. ప్రభుత్వానికి ప్రజలకు వారధిగా పని చేస్తున్న జర్నలిస్టులను అక్రమ కేసులతో బాధపెట్టడం సరికాదన్నారు.

వడదెబ్బ నివారణపై అవగాహన


రామడుగు: కూరగాయల విత్తనాలను అందజేస్తున్న ఎజ్రా మల్లేశం

జమ్మికుంట: మండలంలోని గండ్రపల్లి గ్రామంలో ఉపాధి హామీ కూలీలకు వావిలాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డా. రాజేశ్ ఆధ్వర్యంలో మంగళవారం వడదెబ్బ నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

రామడుగులో...

రామడుగు: మండల కేంద్రంలోని బెరాకా చర్చిలో వ్యాలీ ఆఫ్ బెరాకా మినిస్ట్రీస్, విశ్వ ప్రగామి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆరోగ్యంపై అవగాహన సదస్సు నిర్వహించారు. తెలంగాణ సైకాలజిస్ట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎజ్రా మల్లేశం మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యంతోనే మంచి ఫలితాలను సాధించే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో పాస్టర్ అబ్రహం, ప్రదీప్‌కుమార్ పలువురు పాల్గొన్నారు.

స్కూల్ బస్సులకు ఫిట్‌నెస్ పరీక్షలు చేయించాలి


ప్రైవేటు స్కూళ్ల యజమానులతో మాట్లాడుతున్న ఎంవీఐ కంచి వేణు

హుజూరాబాద్: పట్టణంలోని కేసీ క్యాంపులో ఎంవీఐ కార్యాలయంలో ప్రైవేటు పాఠశాలల బస్సుల ఫిట్‌నెస్‌పై ఎంవీఐ కెంచి వేణు స్కూల్ యాజమాన్యాలకు అవగాహన కల్పించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం యాజమానులు బస్సుల ఫిట్‌నెస్ పరీక్షలు చేయించుకోవాలని, ఎలాంటి లోపాలున్న పిట్‌నెస్ జరగదన్నారు. ఈ నెల 20 నుంచి పిట్‌నెస్ పరీక్షలకు అన్ని సిద్ధం చేస్తున్నామని యాజమానులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ట్రస్మా జిల్లా అధ్యక్షుడు కొరెం సంజీవరెడ్డి, హుజూరాబాద్, జమ్మికుంట అధ్యక్షుడు వకులాభరణం వెంకటేశ్వర్లు, సంపత్‌రావు, జిల్లా అసోసియేషన్ ప్రెసిడెంట్ మునిపట్ల తిరుపతిరెడ్డి, నియోజకవర్గ ఇంచార్జి రాజ్‌కుమార్, పారెడ్డి రవీందర్‌రెడ్డి, దాసరి కోటేశ్వర్, సునీల్, రమణారెడ్డిలు పాల్గొన్నారు.

పసిప్రాణాలను కాపాడేందుకే 'ఊయల'

హుజూరాబాద్: పసి ప్రాణాలను కాపాడేందుకే ఊయల పథకం ప్రారంభిస్తున్నామని హుజూరాబాద్ డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ చందు అన్నారు. మంగళవారం పట్టణంలోని ఏరియా ఆసుపత్రిలో హాస్పిటల్ సూపరింటెండెంట్ రాజేందర్‌రెడ్డితో కలిసి పథకాన్ని ప్రారంభించి మాట్లాడారు. కలెక్టర్, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి ఆదేశాల మేరకు క్రెడిల్ బేబి రిసెప్షన్ సెంటర్‌ను ప్రారంభిస్తున్నామని, అనాథ శిశువులకు ప్రభుత్వం అభయమిస్తుందని పసి పిల్లల ప్రాణాలకు భరోసా కల్పిస్తుందన్నారు. పురిటి బిడ్డలను ముళ్లపొదలు, చెత్తకుండీల పాలు చేసేవారు మానవత్వంతో ఆలోచించి ఊయల పథకాన్ని వినియోగించుకోవాలన్నారు. పసిబిడ్డలను ఊయలలో వేస్తే ప్రభుత్వమే బాధ్యతగా పెంచుతుందని పిల్లలను నేరుగా నిర్వాహకులకు అప్పగించాలనుకునే 94908 81098 నంబర్‌ను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య, ఆర్ఎంవో డాక్టర్ సుధాకర్, డీడబ్ల్యూ డీవో జిల్లా అధికారి పంజాల ప్రతాప్‌గౌడ్, డిస్ట్రిక్ట్ హెల్త్ ఎడ్యుకేటర్ ఆరోగ్యశాఖ సిబ్బంది, ఐసీడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.


జమ్మికుంట: పథకాన్ని ప్రారంభిస్తున్న అధికారులు

జమ్మికుంట: పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఉయల (క్రెడిల్ బేబీ రిసెప్షన్ సెంటర్)ను హుజూరాబాద్ డిప్యూటీ డీఎంహెచ్‌వో డా. చందు, హాస్పిట్ సూపరింటెండెంట్ డా. శ్రీకాంత్‌రెడ్డిలు మంగళవారం ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా హెల్త్ ఎడ్యూకేటర్ పంజాల ప్రతాప్‌గౌడ్, డిడబ్ల్యూ డీవో అధికారి సరస్వతి, ఆరోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన


విద్యార్థులతో డీఐఈవో, అధ్యాపకులు

జమ్మికుంట: ఇటీవల వెలువడిన ఇంటర్ పరీక్ష ఫలితాల్లో పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు మంచి ప్రతిభ కనబరచగా డీఐఈవో గంగాధర్ మంగళవారం అభినందించారు. రాష్ట్ర స్థాయిలో ర్యాంక్ సాధించిన సమ్మెట చరణ్, రిత్విక్, అజయ్, అశోక్, ప్రకాశ్, అక్షర, స్పందన, ఎండీ ఖలిమొద్దీన్, కిరణ్, అవినాష్, లావణ్య, రాజేశ్, సౌమ్య, నరేందర్, ప్రియాంకను సన్మానించారు. కార్యక్రమంలో కళాశాల ఇంచార్జి ప్రిన్సిపల్ విశ్వనాథ్‌రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

గునుకులకొండాపూర్‌లో ఎల్లమ్మ బోనాలు


బోనాలతో ఊరేగింపుగా ఆలయానికి వెళ్తున్న మహిళలు

గన్నేరువరం: మండలంలోని గునుకులకొండాపూర్ గ్రామంలో గౌడ కులస్థులు మంగళవారం ఎల్లమ్మ బోనాలు నిర్వహించారు. మహిళలు నెత్తిన బోనాలతో డప్పుచప్పుళ్ల మధ్య గ్రామంలోని వీధులు గుండా ఆలయానికి చేరుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ఏటా నిర్వహించే జాతరకు గ్రామంతో పాటు సమీప గ్రామాలు గుండ్లపల్లి, చీమలకుంటపల్లె, జంగపల్లి, రేణికుంట, తోటపల్లి, మాదాపూర్, హన్మాజిపల్లె, ఖాసీంపేట, వద్దూరు, బేగంపేటకు చెందిన ప్రజలు తరలించారు. కార్యక్రమంలో గౌడ సంఘం అధ్యక్షుడు రమేశ్‌గౌడ్, ఉపాధ్యక్షుడు తాళ్లపల్లి రవికుమార్‌గౌడ్, కోశాధికారి పెద్ద రాజయ్య, మాజీ జెడ్పీటీసీ తిరుపతి, కరీంనగర్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నాగరాజు, సీపీఎస్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భాస్కర్, టీడీపీ మండల అధ్యక్షుడు పర్శరాములుగౌడ్, సీపీఐ నాయకులు రాజు, మాజీ సర్పంచులు కనకయ్య, మల్లేశంగౌడ్, అజయ్‌వర్మ, యూత్ కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు లింగంపల్లి హరి, ఎల్ఐసీ చైర్మన్ క్లబ్ సభ్యుడు పర్ల రాజు పాల్గొన్నారు.


ఎల్లమ్మతల్లికి మొక్కులు చెల్లిస్తున్న గ్రామస్తులు

హనుమాన్ చాలీసా పారాయణం

శంకరపట్నం: మండలంలోని కన్నాపూర్ వాలీసుగ్రీవ ఆలయంలో మంగళవారం రాత్రి ఆంజనేయ మాలధారణ భక్తులు హన్‌మాన్ చాలీసా పారాయణం చేశారు. కార్యక్రమంలో కన్నాపూర్, ధర్మారం గ్రామానికి చెందిన భక్తులు పాల్గొన్నారు.


హన్‌మాన్‌చాలీసా పారాయణం చేస్తున్న భక్తులు

మున్నూరుకాపులు రాజకీయంగా ఎదగాలి

గంగాధర: రాష్ట్రంలో మున్నూరుకాపులు రాజకీయంగా ఎదగాలని మున్నూరుకాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండ దేవయ్య పటేల్ పిలుపునిచ్చారు.మండల కేంద్రంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించిన సమగ్ర కుటుంబ సర్వేలో 28 లక్షల మున్నూరుకాపులు 18 శాతంతో మొదటి స్థానంలో నిలిచారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వహించిన కుల గణనలో 13.5 శాతంగా పేర్కొందన్నారు. మొదటి స్థానంలో ఉన్న బీసీలను ఐదో స్థానానికి తీసుకెళ్లారని, కేసీఆర్ ప్రభుత్వం అన్ని కుల సంఘాలకు నిధులు కేటాయించినా మున్నూరుకాపులకు ఒక్క రూపాయి కేటాయించ లేదన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత మున్నూరు కాపు కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని సొసైటీని మాత్రమే ఏర్పాటు చేసి చేతులు దులుపుకుందన్నారు. మున్నూరు కాపులను సంఘటితం చేయడానికి గ్రామ, మండల, జిల్లా స్థాయి కమిటీలు వేసి సంఘాన్ని బలోపేతం చేస్తామన్నారు. సమావేశంలో నాయకులు మడ్లపల్లి శ్రీనివాస్, పూదరి తిరుపతి, కొప్పుల బుచ్చిరాములు, సత్తు కనుకయ్య, మడ్లపల్లి గంగాధర్, మాడిశెట్టి జనార్దన్, అమిరిశెట్టి భూమిరెడ్డి, గంట కిషన్, ఆకుల అంజయ్య, చిరుత కిషన్, జారతి సత్తయ్య, సామంతు శ్రీనివాస్, దొడ్ల ఎల్లారెడ్డి, చిరుత శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కొండ దేవయ్య

సమ్మె విజయవంతం చేయాలి

శంకరపట్నం: కార్మికుల సమస్యల సాధన కోసం ఈ నెల 20న చేపట్టే దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని వ్యవసాయకార్మిక సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి వడ్ల రాజు కోరారు. నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని చేపడుతున్న సమ్మెలో పాల్గొనాలన్నారు. ముత్తారం గ్రామంలో ఉపాధి హామీకూలీలను కలిసి మాట్లాడారు.

మంత్రి పొంగులేటికి వినతి


వినతిపత్రం అందజేస్తున్న వొడితెల ప్రణవ్

హుజూరాబాద్: రాష్ట్ర రెవెన్యూ, సమాచార, గృహ నిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని హైదరాబాద్‌లోని కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఇందిరమ్మ ఇళ్లలో నియోజకవర్గానికి అధిక ప్రాధాన్యత కల్పించాలని, రెండో విడతలో ఎక్కువగా కేటాయించాలని వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

గంజాయి అమ్మినా, సేవించినా కేసులు నమోదు

హుజూరాబాద్ ఏసీపీ శ్రీనివాస్‌జి

హుజూరాబాద్: గంజాయి అమ్మినా, సేవించినా కేసులు నమోదు చేస్తామని హుజూరాబాద్ ఏసిపి శ్రీనివాస్‌జి అన్నారు. పట్టణంలోని పోలీస్ స్టేషన్‌లో మంగళవారం మత్తుపదార్థాలకు బానిసైన యువకులకు తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సిలింగ్ ఇచ్చారు. మండలంలోని గ్రామాల్లో కొంతమంది వ్యక్తులు గంజాయి అమ్ముతున్న సమాచారం ఉందని, పోలీసులు వారిని అదుపులోకి తీసుకొని విచారించగా తుమ్మనపల్లి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి భద్రాచలం ఏరియా నుంచి గంజాయి కొనుగోలు చేసి పలువురికి విక్రయిస్తున్న విషయం తెలిసిందన్నారు. మత్తుపదార్థాలు, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో టౌన్ సీఐ కరణాకర్, ఎస్ఐ నరేందర్‌రెడ్డి, పోలీసులు పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న ఏసీపీ శ్రీనివాస్‌జి, పోలీసులు

దేశరాజ్‌పల్లిలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న శాస్త్రవేత్తలు

రామడుగు: రైతులు తక్కువ మోతాదులో యూరియా వాడాలని, సాగు ఖర్చులను తగ్గించుకోవాలని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్త ఉషారాణి తెలిపారు. రామడుగు మండలంలోని దేశరాజ్‌పల్లి రైతువేదికలో మంగళవారం రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమం నిర్వహించారు. గోపాల్‌రావుపేట మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ బొమ్మరవేణి తిరుమల, శాస్త్రవేత్తలు విజయభాస్కర్, శ్రీనివాస్‌రావు, విష్ణువర్ధన్‌రెడ్డి, ఏడీఏ ప్రియదర్శిని, ఏవో త్రివేదిక, సీడ్ ఆఫీసర్ మౌనిక, ఉద్యానశాఖ అధికారి రోహిత్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ


నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యేలు, తదితరులు

చొప్పదండి: మండలంలోని ఆర్నకొండకు చెందిన కోమల్ల రాజేశం తండ్రి నారాయణ మృతిచెందారు. చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మంగళవారం రాజేశంను పరామర్శించారు. వెంట ఏఎంసీ చైర్మన్ మహేశ్, శ్రీనివాస్‌రెడ్డి, చందు, గంగయ్యగౌడ్, మణిశంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్య

శంకరపట్నం: మండలంలోని కొత్తగట్టు గ్రామానికి చెందిన తీగల రాజేశ్వరి(55) కుటుంబ పరిస్థితులు, ఆర్థిక ఇబ్బందులతో వ్యవసాయబావిలో దూకి ఆత్మహత్య చేసుకుందని ఎస్సై రవి తెలిపారు. రాజేశ్వరి కొడుకు రమేశ్ కోడలు మనస్పర్థలు రావడంతో వేరుగా ఉంటున్నారు. రమేశ్ తన ఇద్దరు పిల్లలతో కలిసి తల్లి రాజేశ్వరితో ఉంటున్నాడు. ఈ క్రమంలో వారికి ఆర్థిక ఇబ్బందులు, అప్పులు పెరిగాయి. సోమవారం హుజూరాబాద్ మండలం ఇప్పలనర్సింగాపూర్‌లోని తల్లిగారింటి వెళ్తున్నానని ఇంటి నుంచి బయల్దేదేరిన రాజేశ్వరి మంగళవారం కొత్తగట్టు గ్రామశివారులో ఓ రైతు వ్యవసాయబావిలో శవమై తేలింది. కుటుంబ సమస్యలు, ఆర్థిక ఇబ్బందులతోనే తన తల్లి ఆత్మహత్య చేసుకుందని రమేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గన్నేరువరంలో పిడుగుపాటు

గన్నేరువరం: మండలంలోని మాదాపూర్‌లో జెల్ల పోచమల్లు ఇంటి సమీపంలోని వేపచెట్టుపై మంగళవారం పిడుగుపడింది. ప్రాణాపాయం తప్పిందని గ్రామస్తులు తెలిపారు. పిడుగుపాటుకు గ్రామస్తులందరు ఉలిక్కిపడ్డారు. ఖాసీంపేట, పారువెల్ల, గన్నేరువరంలో ఈదురుగాలులతో కూడిన వర్షానికి వడ్ల కుప్పలపై కప్పిన టార్పాలిన్లు కొట్టుకుపోవడంతో ధాన్యం తడిపిసోయింది.


పారువెల్లలో తడిసిన ధాన్యం

అదృశ్యం కేసు నమోదు

గంగాధర: మండలంలోని ఉప్పరమల్యాల గ్రామానికి చెందిన వివాహిత కనకట్ల శిరీష అదృశ్యంపై కేసు నమోదు చేశామని ట్రైనీ ఎస్సై స్వాతి తెలిపారు. ఈ నెల 10న డబ్బుల విషయంలో భర్త మహేశ్‌తో గొడవపడగా మరుసటి రోజు ఉదయం గంగాధరలో సామాను తీసుకురావడానికి వెళ్తున్నాని చెప్పి ఇంటికి తిరిగి రాలేదు. శిరీష తండ్రి బాబు ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నామని వివరించారు.

ఎల్లమ్మగుడిలో చోరీ

జమ్మికుంట: మండలంలోని మడిపల్లి ఎల్లమ్మగుడిలో గుర్తు తెలియని దొంగలు చోరీకి పాల్పడ్డారు. పోలీసులు తెలిపిన వివరాలు.. గ్రామంలోని తాటివనంలో ఉన్న ఎల్లమ్మగుడిలో అమ్మవారి పుస్తెలు, ముక్కపుడక, చెవి రింగులు, వెండిమెట్టెలు, హుండీలోని నగదు ఎత్తుకెళ్లారు. గౌడ సంఘం అధ్యక్షుడు ఒల్లాల భాస్కర్, పల్లెర్ల కొంరయ్యతోపాటు గౌడ కులస్థుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు టౌన్ సీఐ రవి తెలిపారు.

మూడు పాడి గేదెలు ..

శంకరపట్నం: మండలంలోని మొలంగూర్ గ్రామంలో మూడు పాడి గేదెలు చోరీ చేశారు. తుమ్మ రాజుకు చెందిన రెండు పాడి గేదెలు, మొగిళికి చెందిన ఓ పాడి గేదెను సోమవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు తీసుకెళ్లారు. మంగళవారం కేశవపట్నం పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితులు తెలిపారు.

గద్దపాకలో తాటివనం దగ్ధం



శంకరపట్నం: మండలంలోని గద్దపాక గ్రామంలో మంగళవారం రాత్రి తాటివనం దగ్ధమైంది. తాటివనంలోని విద్యుత్ తీగలు గాలులకు ఒకదానికొకటి తగిలి నిప్పురవ్వలు చెలరేగాయి. తాటివనం దగ్ధమవుతుండగా వ్యవసాయ మోటార్లు పెట్టి మంటలను ఆర్పివేశారు. మండలంలోని వంకాయగూడెం గ్రామ శివారులో మంటలు అంటుకొని మక్త గ్రామం వరకు వ్యాపించాయి.